క్లుప్తంగా

సీఎం పర్యటనకు సహకరించండి



పారిశుధ్య కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ముగిసే వరకు ప్రతి పారిశుధ్య కార్మికుడు తమ విధులను సక్రమంగా నిర్వహించి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. శుక్రవారం సాయంత్రం కమిషనర్ చాంబర్‌లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన పారిశుధ్య కార్మికురాలికి రావలసిన ప్రోత్సాహకాలు అందే ఏర్పాటు చేస్తామని కమిషనర్ తెలిపారు. పారిశుధ్య కార్మిక సంఘ అధ్యక్షుడు బొచ్చ శ్రీను, కార్యదర్శి కసింకోట కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల సద్భావన ప్రతిజ్ఞ



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో సిబ్బంది సద్భావనా దివస్ ప్రతిజ్ఞ చేశారు. ఏటా రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆగస్టు 20న రైల్వే బోర్డు, డీఆర్ఎంల ఆదేశాల మేరకు ఈ ప్రతిజ్ఞ చేస్తామని స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ తెలిపారు. 20వ తేది సెలవు కావడంతో రైల్వే బోర్డు ఆదేశాల మేరకు శనివారం ప్రతిజ్ఞ చేసినట్టు తెలిపారు. రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, స్టేషన్ సూపరింటెండెంట్లు అనంతలక్ష్మి, శ్రీధర్ స్టేషన్ మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్వామా అధికారులకు కొనసాగుతున్న శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో డ్వామా ఏపీఎం, ఏపీఓలకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ రెండవ రోజు శుక్రవారం కొనసాగింది. ఈటీసీ మేనేజరు శ్రీనివాసరావు, ఫ్యాకల్టీలు వెంకటేశ్వరరావు, ఎంఎస్ఎన్ రెడ్డి, నిహారిక శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో భాగంగా సాయంత్రం మునగ తోటలపై ఫీల్డ్ విజిట్ నిర్వహించారు.

ఎంటీలకు ముగిసిన శిక్షణ

సామర్లకోట: వివిధ జిల్లాల పంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ శిక్షణకు ఈఓ పీఆర్డీలు, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు మాస్టర్ ట్రైనీలుగా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ఈటీసీ మేనేజర్ పి.శ్రీనివాసరావు, ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, బి.ఆంజనేయులు, కేఎస్ఆర్ నిహారిక పాల్గొన్నారు.

రైలులో కెమెరా బ్యాగ్



సామర్లకోట స్టేషన్‌లో టీసీకి బ్యాగ్ అందజేసిన ప్రయాణికులు

సామర్లకోట: తిరుపతి–కాకినాడ రైలు బీ4 కోచ్ 33 నుంచి 38 బెర్త్‌ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి కెమెరా బ్యాగ్ మరచిపోయాడు. సామర్లకోటలో రైలు దిగుతున్న ప్రయాణికులు బ్యాగ్‌ను గమనించి టికెట్ కలెక్టరు చేతికి బ్యాగ్‌ను అందజేశారు. బ్యాగ్ మరచిపోయిన వారు కాకినాడ రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు. వివరాలకు లంకలపల్లి శ్రీనివాసును 98498 36750లో సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సాయి ప్రసాద్

పెద్దాపురం: పట్టణంలో జరుగుతున్న ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ సిబ్బందికి సూచించారు. పట్టణంలో అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట కౌన్సిలర్లు తృసలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా తదితరులున్నారు.

వార్డు ఉప ఎన్నికకు సర్వం సిద్ధం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం కొడవలిలో ఖాళీగా ఉన్న 12వ వార్డు మెంబర్ ఎన్నికకు సర్వం సిద్ధమైంది. శనివారం ఉదయం ఎన్నిక నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఈ ఎన్నికకు సంబంధించి నామినేషన్లు స్వీకరించగా నలుగురు అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గృహానందం

- శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు
- ఆనందోత్సాహాల్లో లబ్ధిదారులు
- పేదింటి కల సాకారం దిశగా ప్రభుత్వం చురుకైన చర్యలు



జగనన్న కాలనీలో గృహప్రవేశం పూర్తి అయ్యి పాన్‌షాప్ నడుపుతున్న మహిళ

పెద్దాపురం: గత టీడీపీ పాలనలో నియోజకవర్గంలో సొంతింటి కల కలగానే మిగిలిపోతుందని పేదలు ఒక నిర్ణయానికి వచ్చేశారు. ఎన్నికల ముందు టిడ్కో ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రభుత్వ నిబంధనలు కఠినంగా ఉండడంతో పాటు అపార్ట్‌మెంట్ తరహాలో ఇళ్లు ఇవ్వడంతో ఎవరూ ముందుకు రాలేదు. 2019 వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు సొంతిల్లు ఉండాలన్న దిశగా అడుగులు చకచకా పడ్డాయి. వేల సంఖ్యలో లబ్ధిదారులు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పెద్దాపురం అర్బన్‌తో పాటు మండలంలోని వడ్లమూరు. ఆనూరు, కట్టమూరు, జి.రాగంపేట ప్రాంతాల్లో జగనన్న కాలనీలకు ఇళ్ల స్థలాలిచ్చి సుమారు ఆరు వేల మందికి ఇళ్లను మంజూరు చేశారు. సుమారు వెయ్యి కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చించడంతో గృహ నిర్మాణాలు మరింత వేగవంతంగా నిర్మిస్తున్నారు. గత ప్రభుత్వం కంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గృహ లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



వడ్లమూరు జగనన్న కాలనీలో శరవేగంగా జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు

పెద్దాపురం మున్సిపాలిటీలో..		పెద్దాపురం మండలంలో	
మంజూరైన ఇళ్ల స్థలాలు:	2503	మంజూరైన ఇళ్ల స్థలాలు :	2843
నిర్మాణంలో ఉన్నవి :	1628	నిర్మాణంలో ఉన్నవి :	932
పునాది దశలో ఉన్నవి :	304	పునాది దశలో ఉన్నవి :	238
గోడలు పూర్తి అయినవి :	45	గోడలు పూర్తి అయినవి :	32
శ్లాబులు పూర్తి అయినవి :	41	శ్లాబులు పూర్తి అయినవి :	78
ఇళ్లు పూర్తి అయినవి :	232	ఇళ్లు పూర్తి అయినవి :	896

రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి

జగనన్న కాలనీలో రోడ్ల నిర్మాణాలు పూర్తయితే మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. వర్షం వస్తే ఇబ్బందిగా ఉంటోంది. మంచినీటి, విద్యుత్ సరఫరా అన్ని వసతులు కల్పించారు. రహదారులు నిర్మిస్తే ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లలో మేమంతా చాలా ఆనందంగా జీవించగలుగుతాం.

– బల్ల చెల్లారాణి, వడ్లమూరు, పెద్దాపురం మండలం



శరవేగంగా గృహ నిర్మాణాలు..

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. లబ్ధిదారులు చాలా మంది ముహూర్తాలు చూసుకుని ఇళ్ల నిర్మాణాలు, గృహప్రవేశాలు చేస్తున్నారు. ప్రస్తుతం శ్రావణ మాసం ఆరంభం కావడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు మరింత వేగంగా చేపట్టేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు.

– ఆర్ఎస్‌కె రాజు, డీఈ, గృహ నిర్మాణ శాఖ, పెద్దాపురం



నేడు చెట్ల నరికివేతకు వేలం

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) లే అవుట్‌లోని 5.75 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెట్ల నరికివేతకు శనివారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరి, మామిడి, టేకు, ఉసిరి, గానుగ, బొడ్డు మామిడి, నడికి, నేరేడు, నిద్రగన్నేరు, అశోక, రావి, దిర్శిని, చింత, యూకలిప్టస్, జీడిమామిడి వంటి 427 చెట్లు నరికి తీసుకొని పోవడానికి కాకినాడ ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు బహిరంగ వేలంలో పాల్గొనాలన్నారు.

మద్యం తాగి డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు

కొత్తపల్లి: మద్యం తాగి వాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై రామలింగేశ్వరరావు హెచ్చరించారు. ఉప్పాడ బీచ్ రోడ్డులో శుక్రవారం ఆయన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలను నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీంతో వాహనాలు నడిపిన వారే కాకుండా అమాయక ప్రజలు సైతం మృత్యువాత పడుతున్నారన్నారు. ముఖ్యంగా ఉప్పాడ–కాకినాడ బీచ్‌రోడ్డులో జరిగే ప్రమాదాలకు మద్యం తాగి అతివేగంగా వాహనాలను నడపడమే కారణమని తెలిపారు.

వరలక్ష్మీ నమోస్తుతే...!



సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ పూజలు
- కిటకిటలాడిన పాదగయ, పంచారామ క్షేత్రాలు



పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పిఠాపురం: శ్రావణమాసంలో మొదటి శుక్రవారం కావడంతో దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన పిఠాపురం పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. పాదగయ పుష్కరిణిలో మహిళలు, భక్తులు పవిత్ర స్నానాలను ఆచరించారు. మహిళలు పురుహూతిక, రాజరాజేశ్వరి అమ్మవార్ల సన్నిధిలో అత్యంత భక్తి శ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేశారు. అనంతరం దేవాలయంలోని కుక్కుటేశ్వర స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతిక అమ్మవారు, దత్తాత్రేయ స్వామి, సాయిబాబాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర ఆలయం శ్రావణ మాసం మొదటి శుక్రవారం కావడంతో భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్రత సామగ్రిని ఆలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేసింది. ఆలయ మొదటి అంతస్తు ప్రాకారం చుట్టు వ్రతాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈఓ వి నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు లక్ష్మీదేవి చిత్రపటం వద్ద పూజలు, సామూహిక వ్రతాలు ప్రారంభించారు. ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, వినయ్, చెరుకూరి రాంబాబు పూజలు నిర్వహించారు. ఈ వ్రతాల్లో సుమారు 400 మంది పాల్గొన్నారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ట్రస్టు బోర్డు సభ్యులు నాతిపాముల సూరిబాబు, బొందలపు కృష్ణవేణి, చల్లా కుమారి, కర్రి వెంకటలక్ష్మి, భక్త సంఘం నాయకులు తలుపుల అంజనీకుమార్, బీవీ రమణ, చల్లా సత్తిబాబు భక్తులకు సేవలందించారు.



కొమరగిరిలో ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు

కిటకిటలాడిన దేవాలయాలు

కొత్తపల్లి: శ్రావణమాసంలో తొలి శుక్రవారం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కొత్తపల్లి శ్రీధర్మశాస్తా ఆలయంలోని దుర్గాదేవి, కొత్తదొడ్డిలోని బాలదుర్గ, యండపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొండెవరం, గొర్స, ఉప్పాడ గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలకు తెల్లవారుజాము నుంచి భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పండితులు అమ్మవార్లకు వివిధ రకాల పూలతో విశేష అలంకరణలు చేశారు.

గోదావరి కాలువలోకి ఆర్టీసీ బస్సు

- మోటారు సైకిల్‌ను తప్పించే క్రమంలో ప్రమాదం
- ప్రయాణికులు సురక్షితం

సామర్లకోట: కెనాల్ రోడ్డులో శుక్రవారం ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం ప్రకారం ఆర్టీసీ బస్సు రాజమహేంద్రవరం నుంచి సామర్లకోట వస్తుండగా జి.మేడపాడు పుంత రోడ్డు నుంచి కెనాల్ రోడ్డు ఎక్కుతున్న మోటారు సైకిలును తప్పించే క్రమంలో గోదావరి కాలువ స్నానాల రేవు కల్వర్టును ఢీకొని ఆగిపోయింది. ఆ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. జి. మేడపాడుకు చెందిన సప్పా సీతారాం తన భార్యను తీసుకుని మోటారు సైకిలుపై ద్వారపూడిలో బట్టలు కొనుగోలు చేసుకొవడానికి వెళ్తుండగా బస్సును గమనించక పోవడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. సీతారాం స్వల్పంగా గాయపడగా, అతని భార్య సురక్షితంగా బయటపడినట్టు పోలీసులు తెలిపారు. మోటారు సైకిలును ఈడ్చుకొని స్నానాల రేవు కల్వర్టును ఢీకొనడంతో బస్సు టైర్ ఒకసారిగా పేలి పొయింది. దాంతో సమీపంలో పొలంలో ఉన్న రైతులు హుటాహుటిన వచ్చి క్షతగాత్రుడిని స్థానిక ఆస్పత్రికి తరలించి, బస్సులో ఉన్నవారు దిగేందుకు సాయం చేశారు.



జి. మేడపాడు సమీపంలో గోదావరి కాలువ వైపు దూసుకుపోయిన బస్సు

గొలుసు చోరీకి విఫలయత్నం

- అప్రమత్తమైన స్థానికులు
- పోలీసులకు నిందితుడి అప్పగింత

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురానికి చెందిన ఒక మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కుని పారి పోతున్న వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. సదరు మహిళ తన బంధువులను రైలు ఎక్కించి అడ్డదారిలో రైల్వే బ్రిడ్జి అండర్ పాస్ మీదుగా వస్తున్న సమయంలో రామాలయం వద్ద ఆ యువకుడు ఆమె మెడలో గొలుసు తెంపుకొని పారిపోయాడు. ఆమె కేకలు వేయడంతో అక్కడే ఉన్న పారిశుధ్య కార్మికుడు అతడిని వెంబడించి పట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న విధులలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ దొర ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. నిందితుడు సర్పవరానికి చెందిన వల్లి సురేష్‌గా గుర్తించామని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తెలిపారు.



నిందితుడిని పట్టుకున్న శానిటరీ వర్కరు, స్థానికులు

బాలాత్రిపురసుందరికి భారీ సారె



అమ్మవారికి సమర్పించిన సారెతో సమితి సభ్యులు

బోట్‌క్లబ్: శ్రావణమాసం సందర్భంగా బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామికి ఆ సేవాసమితి సభ్యులు శుక్రవారం భారీ సారె సమర్పించారు. ఒకొక్క రకానికి 108 కేజీల చొప్పున వివిధ రకాల స్వీట్లు సమర్పించారు. రామారావుపేట శివాలయం నుంచి ఊరేగింపుగా సారె తీసుకొచ్చారు. ఈవో చింతపల్లి విజయ్ భాస్కరరెడ్డి, గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ పెద్ది రత్నాజీ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయండి

- ఎంపీపీ కారే సుధ
- కొత్తపల్లిలో మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధ

కొత్తపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ కారే సుధ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ సుధ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలుశాఖల అధికారులు, ఎంపీటీసీలు గైర్హాజరు కావడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులకు నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓను ఆదేశించారు. గ్రామాల్లోని సమస్యలను ప్రజా ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మౌనిక తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, తహసీల్దార్ ప్రసాద్, ఈఓపీఆర్డీ భాస్కరరావు, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న మరిడమ్మ వారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన మరిడమ్మ తల్లికి శ్రావణ మాసం తొలి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమం నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



వెండి గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు





నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు (అంతర చిత్రం) ఆలయ ప్రాంగణంలో మొక్కలతో అలంకరణ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని 133వ సత్యవిదియ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రత్నగిరిపై చేసిన పుష్పాలంకరణ, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. సుమారు వంద మంది రుత్విక్కులు పూజలు, అభిషేకాలు, జపాలు, పారాయణలు తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ఉదయం వెండి రథంపై, రాత్రి వెండి గరుడ వాహనంపై ఊరేగించారు. స్థానిక కావ్యశ్రీ నృత్యకళాశాలకు చెందిన చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. రంగురంగుల విద్యుత్ దీపాల నడుమ సత్యదేవుని ఆలయం కళకళ లాడింది.

కళాక్షేత్రం పనులు వేగవంతం చేయండి

- కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు

కాకినాడ: రూ.20 కోట్లతో నిర్మిస్తున్న రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ కళాక్షేత్ర పనులను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. శుక్రవారం ఆయన కళాక్షేత్ర నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ చివరి నాటికి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట కన్‌స్ట్రక్షన్స్ మేనేజర్ కామేష్, శ్రీ సూర్యరామ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు ఉన్నారు.

కన్వర్టబుల్ స్టేడియం పనుల పరిశీలన

స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన కన్వర్టబుల్ స్టేడియం నిర్మాణ పనులను కమిషనర్ నాగ నరసింహారావు పరిశీలించారు. రూ.8.20 కోట్లతో సురేష్‌నగర్‌లో దీనిని నిర్మిస్తున్నారు. 1200 సీట్ల సామర్థ్యంతో ఈ స్టేడియం నిర్మిస్తున్నట్టు ఆయన తెలిపారు. బాస్కెట్ బాల్, వాలీబాల్, త్రో బాల్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి వివిధ పోటీల నిర్వహణకు వీలుగా స్టేడియం నిర్మిస్తున్నట్టు తెలిపారు.



కళాక్షేత్రం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

పరిశుభ్రతే ఆరోగ్యానికి ఆయుధం

కాకినాడ: పరిశుభ్రతను పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చునని పాఠశాల విద్య ఆర్‌జేడీ జి.నాగమణి పేర్కొన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో శుక్రవారం గాడిమొగ, భైరవపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న కౌమార విద్యార్థులకు ఆరోగ్య అవగాహన, పరిశుభ్రత, ఋతుక్రమంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ అవగాహన సదస్సు నిర్వహించింది. సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్య, వైద్య రంగాలకు చేస్తున్న సేవల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌జేడీ మాట్లాడుతూ ఇటువంటి సదస్సుల వల్ల ఎంతో మేలు జరుగుతుందని, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు హాజరై విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. రిలయన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.రాజేష్, సీఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.